క్లుప్తంగా

వేసవి జాగ్రత్తలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సింగరేణి వైద్యురాలు శిరీష

సత్తుపల్లి: వేసవికాలం దృష్ట్యా పెరుగుతున్న ఎండలతో సింగరేణి కార్మికులు, అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డిస్పెన్సరీ వైద్యురాలు శిరీష మాట్లాడుతూ.. ఎండల తీవ్రత నుంచి తాము కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, చిట్కాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సురేష్, సిఫ్ట్ ఇన్‌చార్జ్ అవినాష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ భరణి, ఐఎన్‌టీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రామ్‌సాగర్, సంక్షేమ అధికారి విజయ సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి



ఏఈకి సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: 20రోజులుగా భగీరథ నీళ్లు రాక.. ఇబ్బందులు పడుతున్నామని మండల పరిధిలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ గుడితండా గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో మాణిక్యారం గ్రామ పంచాయతీ స్పెషలాఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ అక్కడకు చేరుకొని.. ఆందోళనకారులతో మాట్లాడారు. నీటి విషయమై అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం వ్యవసాయ బావులకు పోవాల్సి వస్తుందని.. సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఏఈ ఒక్కరోజులో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో.. గ్రామస్తులు ఆందోళన విరమించారు.

వీరబాబును అభినందించిన కేంద్ర మాజీ మంత్రి



రేణుకా చౌదరితో నాయకులు

వైరా: జిల్లా కాంగ్రెస్ ఎస్‌సెల్ కన్వీనర్‌గా నియమితుడైన వైరాకు చెందిన గుత్తికొండ వీరబాబును కేంద్ర మాజీ మంత్రి కె.రేణుకా చౌదరి అభినందించారు. బుధవారం ఖమ్మం వచ్చిన ఆమెను వైరా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేణుక వీరబాబును అభినందించి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగారావు, సంతోష్ , నాగరాజు, రత్తయ్య, పుల్లయ్య, సత్యనారాయణ, సాయి, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన తల్లాడ ఎంపీటీసీ



పార్టీలో చేరిన వారితో వినోద్‌రావు

తల్లాడ: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సమక్షంలో గురువారం తల్లాడ స్వతంత్ర్య ఎంపీటీసీ–2 చల్లా తిరుమలాదేవి ఖమ్మంలో వినోద్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై తాము స్వంత్రత్య పార్టీ నుంచి బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపుకోసం కృషి చేస్తామని తెలిపారు. తిరుమలదేవితో పాటు చల్లా నాగులు, చల్లా నవీన్, చల్లా రాము, చల్లా వెంకట్, చల్లా రాము కుమార్, కిరణ్, ప్రవీణ్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో బీజేపీ ఇంటింటి ప్రచారం

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పమ్మి నర్సింహారావు, బూత్ అధ్యక్షులు పవన్ సందీప్, కోమటి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలకు గ్రీన్ సిగ్నల్!

- ఇక నుంచి 'ఘర్ వాపసీ' మొదలు
- మానవతారాయ్ చేరిక.. నేడు మాజీ మంత్రి సంభాని
- మరికొందరు సైతం అదే దారిలో..



మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీలో చేరికలకు టీపీసీసీ కమిటీని నియమించడంతో 'హస్తం'లో చేరికలకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లయింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన సీట్లు ఆశించి భంగపడిన నేతలు కాంగ్రెస్‌ను వీడి అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయిని ప్రకటించడంతో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా సుదీర్ఘకాలం పని చేసిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, కొండూరి సుధాకర్ తదితరులు పార్టీని వీడారు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం.. సత్తుపల్లిలోనూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడంతో వారు బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు.



గాంధీభవన్‌లో మానవతారాయ్‌కు కండువా కప్పుతున్న జగ్గారెడ్డి, కోదండరామిరెడ్డి

పార్లమెంట్ ఎన్నికల వేళ..

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీలో చేరికలకు రంగం సిద్ధమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పార్టీ అగ్రనేతల సమావేశంలోనూ పార్టీలో చేరికలను ప్రోత్సహించకపోవడం, ప్రధానంగా ఖమ్మం జిల్లాలో చేరికలు తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తమైనట్లు తెలిసింది. ఎన్నికల సమయాన సీటు దక్కలేదని కొందరు నేతలు పార్టీని వీడడం సహజమేనని, మళ్లీ పార్టీలోకి వస్తానంటే చేర్చుకోవాలని దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. చేరికల కమిటీ ఏర్పడిన మొదటి రోజే జిల్లాపై దృష్టి సారించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

మానవతారాయ్‌తో మొదలు..

హైదరాబాద్ గాంధీభవన్ వేదికగా చేరికల కమిటీ సమక్షాన కోటూరి మానవతారాయ్ తన అనుచరులతో కలిసి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఘర్ వాపసీ కార్యక్రమంలో భాగంగా చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండరామిరెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఇక కొండూరి సుధాకర్ మాత్రం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారని తెలిసింది. ఇకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మండల, పట్టణ స్థాయి నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. అయితే స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదించి పార్టీకి నష్టం వాటిల్లకుండా చేరికలను ప్రోత్సహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బంది పెట్టిన కొందరు నేతలను తిరిగి చేర్చుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేలు విముఖత చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రారంభమైన పెద్దమ్మతల్లి తిరునాళ్లు



గుడిపాడులో పెద్దమ్మతల్లి తిరునాళ్లకు హాజరైన భక్తులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని నాయకపోడు గిరిజనుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుడిపాడులోని మహిళలంతా జలబిందెలతో ఊరేగింపు నిర్వహించి ముత్యాలమ్మ తల్లికి, పెద్దమ్మతల్లికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గుడిపాడు, అయ్యగారిపేటలలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారుతి సూరిబాబు, పూచి గోవర్ధన్, మారుతి బాబురావు, గంట విష్ణువర్ధన్, పూచి రవి, గంట వసంతరావు, రాజశేఖర్, నాగేశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో కొలువుతీరిన శ్రీగురువమ్మతల్లి – సర్వారెడ్డిల కల్యాణమహోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. గురువమ్మతల్లి జాతరలో భాగంగా.. మూడో రోజు ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు పర్యవేక్షణలో అమ్మవారి కల్యాణమహోత్సవ వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అజ్మీర నాగేశ్వరరావు, మల్లెల నాగేశ్వరరావు, బుడిగ సత్యనారాయణ, బుడిగ ప్రభాకర్, పెద్దబోయిన సురేష్, గణపారపు లక్ష్మీనారాయణ, కంచర్ల శ్రీనివాసరెడ్డి, వీరభద్రం, సొసైటీ డైరెక్టర్ మద్యాహ్నపు శ్రీనివాసరావు, కేలోతు నరేష్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



గురువమ్మతల్లి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నారుగూడెంలో అమ్మవార్ల ఊరేగింపు



అన్నారుగూడెంలో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరాజు ఊరేగింపులో భక్తులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో అంకమ్మ జాతర సందర్భంగా గురువారం అనేక ప్రభలతో ఊరేగింపు నిర్వహించారు. రెండో రోజు అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇంటింటికీ టెంకాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు, సుంకర రోశయ్య, రాజారావు, తోట శ్రీనివాసరావు, పేరసాని నరసింహారావు, తాళ్లూరి బుల్లి రాములు, పావురాల కిట్టయ్య, సాంబ, కొమర్రాజు శ్రీనువాసరావు, షేక్ హుస్సేన్, బేగ్ లాల్, నాగుల్‌మీరా, జానీ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో నిర్మించిన శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 26న ప్రతిష్ఠించనున్న క్రమంలో పురోహితులు కొత్తూరి రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు యాగశాలలో పలువురు మహిళలతో కుంకుమ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్షీరాధివాసం, విగ్రహాలకు, ధ్వజస్తంభానికి పరివార దేవతలకు ధాన్య, పుష్ప, వస్త్ర, పంచ, శయ్యాదివాసాలు నిర్వహించారు. జ్యోతిర్లింగార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ఆలయాల అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయినాథునికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు బాబాని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని ఆలయంలో శ్రీసాయినిలయంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కనకదుర్గమ్మ

- నేడు బస్వాపురంలో కనకదుర్గమ్మ జాతర
- అంగరంగ వైభవంగా ప్రభలు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో గురువారం దుర్గామాత బోనాల ఉత్సవాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కావున శుక్రవారం నుంచి నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. వందల ఏళ్ల క్రితం చైత్ర శుద్ధ బహుళ తదియ నాడు గ్రామంలో కనకదుర్గ అమ్మవారు వెలిశారని అప్పటి నుంచి ఆనవాయితీగా బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు స్థానిక పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా తదియ తర్వాత మూడవ రోజున గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ప్రభలు తయారు చేసుకుని ఊరిలో ఘనంగా ఊరేగిస్తారు. గ్రామస్తులు ఉదయమే ఆలయానికి వచ్చి ఇక్కడే బోనాలు వండి అమ్మవారి పురాతన ఆలయంగా పేరొందిన మర్రి చెట్టు మొదల్లో సమర్పిస్తారు. కార్యక్రమంలో బస్వాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో గురువారం సాయంత్రం ప్రభలు ఊరేగింపు నిర్వహిస్తారు.



బస్వాపురంలోని కనకదుర్గ అమ్మవారు

మెయిన్స్‌లో కౌశిక్ రెడ్డి సత్తా



రేగళ్ల సాయి కౌశిక్ రెడ్డి

మధిర: దేశవ్యాప్తంగా గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మధిరకు చెందిన రేగళ్ల సాయి కౌశిక్ రెడ్డి సత్తా చాటాడు. ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, సునీత దంపతుల కుమారుడు సాయి కౌశిక్ రెడ్డి 99.75 పర్సంటైల్ సాధించాడు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 4014 ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థికి దేశంలోని టాప్ టెన్ ఎన్‌ఐటీల్లో ఇంజనీరింగ్ సీట్ లభించే అవకాశం ఉంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయి కౌశిక్ రెడ్డిని, తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ



పాగి శశాంక్ | రామిశెట్టి జోష్ణవ్ కుమార్ | మామిళ్లపల్లి వర్ష

మధిర: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షా ఫలితాల్లో మధిరకి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను చాటారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పాగి శశాంక్, రామిశెట్టి జోష్ణవ్ కుమార్, మామిళ్లపల్లి వర్ష 466 మార్కులతో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. శశాంక్ 10వ తరగతి మధిర శ్రీ చైతన్యలో, జోష్ణవ్ కుమార్ ఖమ్మం శ్రీ చైతన్య పాఠశాలలో చదివి 10/10జీపీఏ సాధించారు. ఈ విద్యార్థులను పట్టణ ప్రముఖులు అభినందించారు.

మద్యం స్వాధీనం

పెనుబల్లి: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గణేష్‌పాడుకు చెందిన మల్లెల్లి నాగరాజు ఆటోలో తరలిస్తున్న 173 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. అలాగే, ముత్తగూడెంకు చెందిన పోతురాజు ధర్మశ్రీను వద్ద 284 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సుబాబుల్, జామాయిల్ తోటలు దగ్ధం

మధిర/బోనకల్: మధిర మండలం ఇల్లూరులో జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగెకరాల సుబాబుల్ తోట కాలిపోయింది. గ్రామానికి చెందిన రైతులు బంకా గోపాలరావు, గండేపల్లి అరుణ, గండేపల్లి సీతయ్య సాగు చేసిన మూడేళ్ల వయస్సు తోటలు కాలిపోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక బోనకల్ మండలం నారాయణపురంలో రైతు నాగబత్తిని సైదేశ్వరరావుకు చెందిన మూడెకరాల జామాయిల్ తోట గురువారం అగ్నికి ఆహుతైంది. గుర్తు తెలియని వ్యక్తులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టగా మంటలు జామాయిల్ తోటకు వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ వచ్చినా చేను వరకు వెళ్లే అవకాశం లేకపోవడంతో రైతులే ఇబ్బంది పడుతూ మంటలను అదుపు చేశారు. ఘటనతో రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని సైదేశ్వరరావు తెలిపారు.

కేసు నమోదు

వేంసూరు: గత కొంతకాలంగా మండలంలోని వెంకటాపురానికి చెందిన మోహన్‌రావు, ఆయన తల్లిదండ్రులు కనపర్తి కృష్ణయ్య, మంగమ్మ లకు గొడవలు జరుగుతున్నాయి.

ఈ క్రమంలో మాటమాట పెరిగడంతో మోహన్‌రావు తన పేరెంట్స్‌ను గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడు. దీంతో తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



హనుమతండాలో ఓటర్ స్లిప్పులు అందజేస్తున్న కల్లూరు ఆర్డీఓ రాజేందర్

కల్లూరురూరల్: ప్రతీ పౌరుడు తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకోవాలని కల్లూరు ఆర్డీఓ రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని హనుమతండా పంచాయతీలో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటర్ స్లిప్పు అందించాలని ఆయన బీఎల్‌ఓలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేసే సమయంలో ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ధరణి పాస్‌పుస్తకం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం తదితర ఎన్నికల సంఘం గుర్తించిన వాటిలో ఏదో ఒకటి చూపించి ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రభుత్వ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీళ్లు, టెంట్లు తదితర ఏర్పాటు చేయాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హరీష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ..



ముష్టికుంట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆర్డీఓ గణేష్ పరిశీలించారు. ముష్టికుంట్లలోని 105–108, బోనకల్‌లో 113–115, రావినూతలలో 116–119 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు పంపిణీ



సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లిలో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ యోగేశ్వరరావు



తల్లాడ: ఓటరు స్లిప్పులు పంపిణీని ప్రారంభిస్తున్న తహసీల్దార్

సత్తుపల్లిరూరల్/తల్లాడ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం సత్తుపల్లిలో, తల్లాడ పంచాయతీలో ఓటర్ల స్లిప్పుల పంపిణీని తహసీల్దార్లు యోగేశ్వరరావు, రవికుమార్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కుపై సంపూర్ణ అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, నాగస్వామి, శివ, అఖిల పక్ష నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, కేతినేని చలపతిరావు, గాదె కృష్ణారావు, ఆర్ఐలు భాస్కర్ నాయక్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా: జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షల్లో వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఎం.కృష్ణ ప్రజూన్ 301వ ర్యాంకు, ఎం.నమిత 881, వి.సాయిధనుష్ 1,172, ఐ.ఆకాంక్ష 1,292, ఎస్.దీక్షిత 1,333, కె.సుదర్శన్ హితార్థ 3,387, హేమంత్ 3,994, బి.యుగంధర్ 11,271, కె స్వాత్య 12,288 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏటి నర్సింహారావు, అధ్యాపకులు అభినందించారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి



జేవీఆర్ ఓసీని పరిశీలిస్తున్న జైనుల్లాబుద్దీన్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీని సింగరేణి సర్వే విభాగం జనరల్ మేనేజర్ జైనుల్లాబుద్దీన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని, ఇందు కోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సర్వే పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.మధుసూదన్, సర్వేయర్ సంపత్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరబాబు

మధిర: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, వీరబాబు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం దెందుకూరు, మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మలేరియా అనేది కీటక జనిత వ్యాధి అని, దోమలను నివారిస్తే మలేరియాను నిర్మూలించవచ్చని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై, దోమలను గుడ్డు దశలోనే నివారించే పద్ధతులను వివరించారు. దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, బోదకాలు, చిన్నపిల్లల్లో వచ్చే మెదడు వాపు వ్యాధి వంటి విష జ్వరాలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధిర టౌన్, మడుపల్లి, మహదేవపురం బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన వైద్య సిబ్బంది, ఆయుర్వేద వైద్యుడు పాతూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతకాని: చింతకాని మండల కేంద్రంలో గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ పాల్గొని మాట్లాడారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, డ్రమ్ములు, సిమెంట్ తొట్లు, ఇతర నీటి నిల్వలపై మూతలు పెట్టుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా మంగళ, శుక్ర వారాల్లో డ్రైడే పాటించాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధంగా 2030 నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యంగా కలిసి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్య, సీహెచ్‌ఓ వీరేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, ల్యాబ్ టెక్నిషియన్లు సైదులు, రమ, ఏఎన్‌ఎంలు రత్నకుమారి, ఆయుష్ సిబ్బంది శ్రీను, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేయాలి

వైరారూరల్: ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేసి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల అర్జున్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని కొండకొడిమ గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశాలను సందర్శించి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, మోదుగు లాలమ్మ, తెల్లూరి వెంకటేశ్వర్లు, దొంతెబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ఆల్ పెన్షనర్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్, వ్యాపారవేత్తలు నాగుబండి కుమారులు సహకారంతో స్థానిక ఆల్ పెన్షనర్స్ సంఘ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం గురువారం ఏర్పాటు చేశారు.

ఈ చలివేంద్రాన్ని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శొంఠి నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.వైకుంఠరావు, కోశాధికారి ఎంఎస్‌ఆర్ శర్మ, ఉపాధ్యక్షుడు జీవీఎస్ సాయి. దుస్సా వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ బాధ్యులు పెనుగొండ రమేష్, జి.వీరభద్రరావు పాల్గొన్నారు.